అట్టావా (కెనడా) ఆంధ్ర వాహిని — ఆంధ్రజ్యోతి నిర్వహించిన
1988 విభవ శ్రీరామనవమి కథల పోటీలో మూడవ బహుమతి
రు. 200 గెల్చుకున్న రచన

# మహానగరంలో మానవత

"సితార"




అలారం టైంపీసు తనకి ఓపిక ఉన్నంత వరకూ కొట్టి కొట్టి చివరకి మౌనం పట్టింది. అయినా సుధాకర్‌కి స్పృహ రాలేదు.

అది రాంగ్ నంబర్‌లా పని చేయటంతో రాధకి మెలకువ వచ్చింది. తనకీ మత్తు వీడక మగతగా మళ్ళా కళ్ళు మూతలు పడిపోయినై. కారణం వాళ్ళు నిద్రపోయింది కేవలం రెండు గంటలే. అందుకు కారణం వాళ్ళకి పెళ్ళయి కేవలం కొన్ని వారాలే అయింది.

అందంలోనూ,
ఆరోగ్యంలోనూ,
అదృష్టంలోనూ ఎవరు
మిన్నో ఎన్నలేని జంట రాధా
సుధాకర్‌లు.

అంత మత్తులోనూ రాధకి సుధాకర్ నిద్రపోయే ముందు చెప్పిన మాటలు గుర్తొచ్చినై. "టైంపీసు ఫెయిలయితే నీవే నా చెవిలో గీపెట్టి లేపాలి సుమా. చాలా ముఖ్యమైన పని , ఫారెన్నించి వచ్చే గెస్టుల్ని రిసీవ్ చేసుకోవాలి. నిముషం లక్షలు విలువచేసే మనుషులు ఆ వస్తున్న వాళ్ళు " అని మరీ మరీ చెప్పాడు.

సుధాకర్ తన ఫ్యాక్టరీలోనే బోర్డాఫ్ డైరెక్టర్ల మీటింగ్ యేర్పాటు చేశాడు. ఆ వచ్చే అతిథుల్ని అందరికీ పరిచయం చేస్తూ బిజినెస్ సెటిల్ చేయవలసి వుంది. తనే మేనేజింగ్ డైరెక్టర్ కావటం వల్ల తప్పని సరి అయింది. నిజానికి హనీమూన్ మిషతో ఓ నెల మిస్సయి పోదామనుకున్నాడు కాని వీలుపడలేదు.

రాధకు సుధాకర్ మాటలు గుర్తుకు రాగానే అతని

చెవికి తన పెదాలు ఆన్చి టేపురికార్డర్‌లా ప్రారంభించింది. "డైరెక్టర్స్ మీటింగ్ లేవండి... ఫ్లైట్ వచ్చేస్తున్నది లేవండి" టైమయిపోతున్నది లేవండి...డియర్" అంటూ ఒకటే పాట... నగనగా ... వదవగా వదవగా...

చివరికి మంత్రం పట్టిచ్చి చెంగున లేచి కళ్లు నలుపుకుని టైంపీసు ముఖాన్ని చూశాడు...అయిదుంబావు అయింది.

"రాధా! టైంపీసు పని చేయటం లేదా? వినపడలేదేమిటి?" అన్నాడు పీఠం వేసుకు కూర్చుని.

"మహాత్మా! దాని విధి అది సక్రమంగానే నిర్వహించింది. ఎటొచ్చీ మీ బదులు నన్ను లేపింది. మీరు తెములండి. నేను కాస్సేపు పడుకోవాలి అంటూ మళ్లీ ముసుగు పెట్టేసుకుంది.

"అయిదుంబావేగా అయింది.. నేనూ మరో పావుగంట పవళించవచ్చు..." అంటూ తనూ బాంక్లెట్ కప్పేసుకుంటుంటే, రాధ -

అబ్బా! మీరు వెళ్ళండి! పావు గంటలో యేంచేద్దామనీ...యీ పడక అంది.

"పిచ్చి ప్రశ్న! పదిహేను నిముషాల్లో హెవెన్ చూసి రావచ్చు"

"ఎలా! కల్లోనా" అంది దుప్పటిలోంచే చెవులపిల్లిలా చూస్తూ.

"కాదు, యిలా" అంటూ హఠాత్తుగా ఆమెను తన దుప్పటిలోకి లాగేసుకున్నాడు.

అంతే! రాధ మరి పెదాలు విప్పలేదు.

అతడా అవకాశాన్ని యివ్వలేదు.

* * *

వెళ్లాల్సిన టైంకి పావుగంట ముందుగా బైలుదేరాడు సుధాకర్... ఆ పరిస్థితిలో కారుకన్నా మోటారు బండే బెటరనిపించింది...ఓ క్షణం ఆలోచించి బులెట్ స్టార్ట్ చేశాడు...సమయం తక్కువ వుంది. దూసుకు పోతున్నాడు మంచు తెరల్ని చీల్చుకుంటూ.

ఎంతో దగ్గరగా వస్తే తప్ప ఎదుట వస్తున్న



ఇటీవల హైదరాబాద్‌లో భరతనాట్య రంగప్రవేశం చేసిన చిరంజీవి సౌజన్య

వాహనాలు కనిపించడంలేదు...అదీ లైటు వుంటేనే... సూర్యోదయానికి చాలా టైముంది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. జనసంచారం ప్రారంభంకాలేదు. కనుక ధైర్యంగా పోతున్నాడు. వేగాన్ని పెంచి త్వరగా గమ్యంచేరాలని. కాని కన్ను పొడుచుకున్నా కానరాని పరిస్థితి అయినా అలవాటుపడ్డ రోడ్డులే. కనుక ధైర్యంగా మేగ్జిమమ్ స్పీడు పోనిస్తున్నాడు.

"మనిషి మహా మేధావి అయినా...ఎన్ని సాధనాలు కనిపెట్టినా ప్రకృతి చేతిలో కీలుబొమ్మే సుమా!" అనుకుంటూ టెర్నింగ్ కోశాడు.

అంతే...

అదే సమయాన ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని అమాంతం ఆకాశంలోకి ఎగిరాడు సుధాకర్.

* * *

అల్యూమినియం కారేజిని పట్టుకొని పనిలోకి వెళ్తున్న లక్ష్మికి మంచు కారణంగా దారి కనిపించక ప్రక్కకా నడుస్తూ వెళ్తోంది. అప్పుడప్పుడే కాంతి రేఖలు వ్యాపిస్తున్నాయి. మంచు కాస్త పల్చబడింది, వాహనాలు ప్రారంభమైనాయి.

అవసాన దశలో వున్న పల్చని చీర మంచుకు తడిసి వంటికి అంటుకుపోయి కుక్క పిల్ల నాకుతున్నట్టు చలి పుట్టుకొస్తున్నది. అయినా తప్పదు! నాలుగేళ్లలో పనిచేసి... వాళ్ళిచ్చే పదార్థాలు తీసుకుపోయి పిల్లలకి పెట్టాలి. వాళ్లు ఆశతో ఎదురు చూస్తుంటారు. అవసరం ఎంతటి అవస్థనైనా ఎదుర్కొనేలా చేస్తుంది!

లక్ష్మి గబగబా నడుస్తోంది.

చటుక్కున ఆమె దృష్టి రోడ్డు ప్రక్కగా రక్తపు మడుగులో పడున్న సుధాకర్ మీద పడింది. ప్రక్కనే చితికిపోయిన మోటారు సైకిలు. కాళ్ళాడలేదు ఆమెకి. దగ్గరగా వెళ్లి చూసింది. అనుమానం తీరక ముక్కు దగ్గర వేలుంచి చూసింది.

ఓలమ్మో! బిడ్డ బతికే వున్నాడు...రచ్చించండి బాబూ! ఎవరైనా ఆస్పత్రికి తీసుకెల్లండి బాబూ... పున్నెముంటది" అంటూ లక్ష్మి రోడ్డున పోతున్న జనాన్ని కేకలు పెడుతూ పిలవసాగింది. చాలామంది ఆగి చూశారు. "ఏక్సిడెంటురో! బాబూ రేపు పోలీసోళ్లతో లేనిపోని గొడవ మనకెందుకు" అను కుంటూ వెళ్లిపోతున్నారు. ఒక్కరూ ఆగడం లేదు. ఎందరినో చేతులడ్డం పెట్టి ఆపప్రయత్నించింది. ప్రయోజనం లేకపోయింది. లక్ష్మికి మతిపోతోంది.

"కాస్త ఎవరైనా సాయం చేసి ఆసుపత్రి చేరిస్తే బిడ్డ బతుకుతాడు. ఈ సదువుకున్నోళ్ళకి జాలీ దయా... వుండవా? అనుకుంది ఆమె బాధగా. కోపం కూడా వచ్చింది.

తలకి బలమైన గాయం తగిలి స్పృహ లేకుండా పడున్న మనిషిని సాటి మనిషి ఆదుకోక పోవడం, చూస్తూనే వెళ్లిపోవడం లక్ష్మికి ఆశ్చర్యాన్ని కల్గించింది.

'ఇదే మా పేటలో అయితే యీపాటికి వంద మంది వచ్చేవారు, పనులు మనుకొని మరీ అనుకుంది.


లక్ష్మికి పిచ్చెక్కిపోసాగింది. ఇలా కాదని ఓ చిన్న కారు వస్తుంటే అడ్డంగా నిలబడింది. అది టాక్సీ. అతడు విషయం విని "నేను రాను" అతడు పోతే నాకు రిస్కు. కోర్టుల చుట్టూ తిరగలేను" అంటూ వెళ్ళ బోయాడు.

"బాబూ ... నీ అన్నలాంటి వాడు...చావు బతుకుల్లో వున్నాడు. బతికించు బాబూ... ఆ తల్లీ ... భార్యా బిడ్డలూ" నిన్ను దేవుడులా కొలుసుకుంటారు. పద బాబూ తీసికెళ్దాం" అంది.

ఆమె వదలేలా లేదని ..."మరి నా కిరాయి ఎవరిత్తారు? ఆళ్ల మనుషులు వచ్చే దాకా నేనుండను. ఆసుపత్రికెల్లగానే యివ్వాలి" అన్నాడు.

"సరేబాబూ! నేనిత్తాను" పద ముందు సాయంచేసి బాబుని ఆసుపత్రికి జేర్చు" అంది లక్ష్మి తొందర తొందరగా.

టాక్సీ కొద్ది నిమిషాలలో ప్రభుత్వ ఆసుపత్రి ముందాగింది. ఇద్దరూ కలిసి అక్కడి వాళ్ళకి విషయం



చెప్పి ఆసుపత్రిలో చేర్చారు...సంతకం చెయ్యటానికి దగ్గర వాళ్ళు కావాలన్నారు. లక్ష్మి తెలియదంది. డాక్టర్సే సుధాకర్ డైరీని బట్టి తెలుసుకుని యింటికి ఫోన్ చేశారు.

డ్రయివరు కంగారు పెడుతున్నాడు వెళ్లిపోవాలని. అతనికి లక్ష్మి తన చెవులకి వున్న దిద్దులు తీసి యిస్తూ ''బాబూ . ఇయి బంగారపుయే, అడుగున డిప్పలు మాత్రం యిత్తడియి. ఈటిని అమ్మి సొమ్ము తీసుకో బాబూ...నాకాడ సొమ్ము లేదు. ఫరవాలేదు, తీసుకో బాబూ'' అంది.

అతడు ఓ నిమిషం తటపటాయించి వాటిని అందుకొని వెళ్లిపోయాడు. తరువాత కథ నాకనవసరం అన్నట్టు.

సుధాకర్‌కి ట్రీట్‌మెంట్ ప్రారంభమైంది. రక్తం ఎక్కిస్తున్నారు. సమయానికి తేవడం వల్ల గండం గడిచింది అన్నారు డాక్టర్లు. లక్ష్మి తృప్తిగా గాలి పీల్చుకొని వెళ్లిపోయింది.

* * *

రాధ రేయింబవళ్లు సేవచేస్తోంది. నెల రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రి అయినా ట్రీట్‌మెంట్ అంతా స్పెషల్‌గా జరుగుతోంది.

అది యాక్సిడెంట్ అయి వుండకపోతే ఏదైనా మంచి ప్రయివేటు ఆసుపత్రికి మారిపోయి వుండేవారు! డాక్టర్లు యింకా అనుమతి యివ్వలేదు.

యాక్సిడెంట్ చేసి ఆగకుండా వెళ్లిపోయిన వాహనం కోసం గాలిస్తున్నారు పోలీసులు. తల్లి అత్తగారూ ఎందరెన్ని చెప్పినా తనే సుధాకర్ దగ్గర వుంటూ చూస్తున్నది రాధ రేయింబవళ్లూ. పెళ్లయిన కొత్తలోనే ప్రేమ పరీక్షలా జరిగిందీ ప్రమాదం!

''రాధా నీ సేవలతో నన్ను బతికించుకున్నావ్'' నీ ప్రేమామృతాన్ని పోసి నాకు పునర్జీవితాన్ని ఇచ్చావ్ ''నీ లాంటి భార్య లభించడం నా అదృష్టం'' అన్నాడు సుధాకర్ అన్నం తినిపిస్తున్న రాధతో.

''నన్ను కాదండి మీరు పొగడాల్సింది. రోడ్డు ప్రక్కన పడున్న మిమ్మల్ని కారులో తెచ్చి యీ ఆసుపత్రికి తీసుకువచ్చి చేర్పిందట ఓ దేవత ఎవరో'' డాక్టరుగారు ఆమె వివరాలు తెలియదన్నారు. ఆమె ఎవరో తెలిస్తే... ఆమె కాళ్లకి నమస్కరించాలని వుందండి. తిరిగి మన జీవితాలలో వెలుగునింపినందుకు'' అంది రాధ.

''నిజమే రాధా! ఆ కారుణ్యమూర్తి ఎవరో...ఎలా తెలుస్తుంది? ఆమె రుణమెలా తీర్చుకుంటామో? కారులో తీసుకువచ్చిందంటే ఎవరో కలవారి పడుచు అయివుండొచ్చు. ఏదో ఒక రోజు మళ్లా చూడటానికి రావచ్చు'' అన్నాడు సుధాకర్.

అంతలో ఎవరో పిలుస్తున్నట్టు అనిపించి రాధ లేచి వెళ్లింది. తలుపు తెరవగానే...''అమ్మా!! నేను... '' అని ఏదో అనబోతున్న ఆ మనిషి మాట పూర్తి చేయ డానికి అవకాశమియ్యకుండానే ఫో! తల్లీ ఆసుపత్రిలో కూడా అడుక్కుంటే ఎలా! మా బాధల్లో మేముంటే, ఇళ్ల దగ్గరకు. ఫో... ఏదైనా యిస్తారు...'' అంది రాధ విసుక్కుంటూ.

లక్ష్మి బిక్కచచ్చిపోయింది.

''అది కాదమ్మా! నే బిచ్చానికి కాదమ్మా వచ్చింది.''

''మరి'' రెట్టించింది రాధ చికాగ్గా.

''మొన్నా మద్దిన మోటారు సైకిలు మీద ఎల్తా ప్రమాదం జరిగి ఓ బాబు రోడ్డు ప్రక్క పడుంటే యీ ఆసుపత్రికే సేర్పినాము. ఆ బాబు కెల్తా వుందోనని యీ దారిన ఎల్తా వచ్చా తల్లీ! వరండాలో నర్సమ్మ యీగదిలో వుంచామంది. అయ్యగారు బావుండాడుగా తల్లీ!—'' అంది.

''అంటే...అంటే...ఆ రోజు సుధాని తీసుకువచ్చి చేర్పింది'' ఆగిపోయింది.



ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రేలంగి-బుష్ ఫిల్మ్ అవార్డ్స్ ఫంక్షన్‌లో నటుడు బ్రహ్మానందంను సత్కరిస్తున్న దిలీప్‌కుమార్, టి. సుబ్బరామిరెడ్డి

''నానే...తల్లీ... టాక్సీ బాబు సాయంతో తీసుకొచ్చినాము అంది లక్ష్మి. రాధకి మాట రాలేదు.

'నా భర్తకి ప్రాణదానం చేసి...నా పసుపుకుంకాలు కాపాడిన కరుణామూర్తి ఇంత సామాన్యురాలా?' అనుకుంది మనస్సులో ఆశ్చర్యపోతూ.

''క్షమించమ్మా! మా యింటి దీపాన్ని వెలిగించిన దేవతనే పొమ్మన్నాను తెలీక. రాతల్లీ నువు ప్రాణం పోసిన నా దేవుణ్ణి చూద్దువు గాని'' అని లోపలికి తీసుకు వెళ్లింది. సుధాకర్‌కి విషయం చెప్పింది. అతడు ''అమ్మా! నువ్వా! నన్ను రక్షించింది. మరి కాసేపు ఆలస్యమైవుంటే బతికే వాణ్ణి కాదన్నారు డాక్టర్లు. నీ రుణం ఎలా తీర్చుకోగలం'' అన్నాడు ఆమెను చూచిన ఆనందంలో. ఆ అతి సామాన్యురాలికి ఏ భాషలో ఎలా కృతజ్ఞతలు తెలియజేయాలో అర్థంకాలేదు ఆ దంపతులకి.

లక్ష్మికి ఆ మాటలన్నీ అర్థంకాక పోయినా వాళ్ళు చాలా మంచి మనుషులు అనుకుంది తన భాషలో. సొమ్ము యివ్వబోతే వద్దని వెళ్లిపోయింది. తాము అంత శ్రీమంతులయి వుండి...ఆ పనిమనిషి ముందు పెద వాళ్లమయ్యామని అనుకుందా జంట.

* * *

రేపు డిశ్చార్జి చేస్తారనగా ఆ టాక్సీ డ్రయివరు వచ్చి సుధాకర్‌కి యాక్సిడెంట్ రోజు జరిగిందంతా చెప్పి... ఓ దుద్దుల జత యిస్తూ ''అయ్యా! ఇవి ఆమె మళ్లా వస్తే ఆమెకి అందజేయండి. తల్లి లాంటి ఆమె చెవులవి అమ్ముకోటానికి నా చేతులు రాలేదు. తనకేమీ కాక పోయినా మీ కోసం ఆ రోజు ఆమె ఎంత యిదై పోయిందో నాకింకా గుర్తుంది. నాలుగిళ్లల్లో పని చేసుకొని పొట్ట నింపుకునే మనిషే అంత చేస్తే... నా టాక్సీకి యిలా కిరాయి తీసుకోవడం కిరాతకమే అని పించి తెచ్చేశాను. ఆమె వచ్చినప్పుడు యిచ్చెయ్యండి'' అని అక్కడ పెట్టి వెళ్లిపోయాడు. అతనికీ చెక్కు యిద్దామనుకొని ప్రయత్నించిన సుధాకర్ మళ్లా ఓడి పోయాడు. లక్ష్మి మళ్లా రాలేదు. అంత మహా నగరంలో ఆమె జాడ తెలీలేదు.

ఈ నాటికీ ఆ యింటి పూజామందిరంలో మానవతకి గుర్తుగా ఆ మానవతా మూర్తికి మారుగా ఆ చెవి కమ్మలు పూజలందుకుంటూనే వున్నాయి.

*